# మహిళా ఉద్యమ నిర్మాణం: కొన్ని సమస్యలు

డాక్టరు జె.వి. లక్ష్మి, ఎం. బి., బి. ఎస్. (ఆంధ్రప్రదేశ్ మహిళాసంఘ అధ్యక్షురాలు)

*(1950-60ల నాటి కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంత పత్రిక 'సందేశం'లో ప్రచురించబడిన ఈ వ్యాసం ప్రాధాన్యత కలిగినదిగా భావించి పునర్ముద్రిస్తున్నాము - సంపాదకుడు*

ఈ సంవత్సరం మే నెలలో మహిళా ఉద్యమ సమస్యలను, నిర్మాణాన్ని గురించి చర్చించేందుకు, విజయవాడలో రాష్ట్ర కమ్యూనిస్టు మహిళా కార్యకర్తల సమావేశం జరిగింది. జనవరిలో జరిగిన రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ మహాసభ (ఖమ్మం) సూచన ననుసరించి ఈ సమావేశం జరిగింది. ఆ తరువాత జూన్‌లో చిట్టివలసలో జరిగిన ప్రదేశ్ కమ్యూనిస్టు పార్టీ కౌన్సిలు సమావేశం ఈ రంగాన్ని గురించి కొద్దిగా చర్చించింది. అక్టోబరు మొదటి వారంలో జరిగిన అఖిలభారత మహిళా సభలో (కాశీ) మహిళలకు సంబంధించిన అన్ని సమస్యలను వివిధ దృక్పథాలనుండి చర్చించారు. అన్ని సమావేశాల్లోను ఆ మహిళల సమస్యలను చర్చించడమే గాక, తక్షణం మహిళా సంఘ నిర్మాణావశ్యకతను గుర్తించారు. "నిర్మించాలి. నిర్మించాలి" అనే నినాదాలు ఇవ్వబడినాయి. అయితే ఈ నిర్మాణానికి ప్రాతిపదిక అయిన కార్యకర్తలలోటు, పైనుంచి క్రింద దాకా అన్ని సమావేశాలలోను ప్రతిబింబించింది.

ఆంధ్రరాష్ట్ర మహిళా సంఘనిర్మాణంలో కూడ ప్రస్తుతం మేము ఎదుర్కొంటున్న సమస్య ఇదే. స్థానికంగా పట్టణాలలో గాని, గ్రామాలలో గాని సంఘాలు నిర్మించబడినపుడు ఈ కార్యకర్తల సమస్య ఇంత క్లిష్టంగా ఎదుర్కొనదు. స్థానికంగా ఆభిలాష, ఆసక్తి, చైతన్యం గల వ్యక్తులు రోజుకు రెండు లేక మూడు గంటలు వినియోగించిన యెడల ఈ సమస్య పరిష్కారమవుతుంది. దైనందిన కార్యక్రమాలను కుంటుపడకుండా నడిపించుకో గలుగుతారు.

**కార్యకర్తల లోటు**

కాని సంఘ నిర్మాణం గ్రామ, పట్టణ పరిధులను దాటి తాలూకా జిల్లాలకు విస్తరించి నపుడు కార్యకర్తల లోటు ఎదుర్కొంటుంది. జిల్లాలో 5 లేక, ఆరు ప్రాథమిక సంఘాలు ఏర్పడి, అవి పరిసర గ్రామాలకు విస్తరించే అవకాశమున్నపుడు, ఈ సంఘాల కార్యక్రమాన్ని అంతటినీ సమన్వయపరచడానికి ఒకరో ఇద్దరో మహిళలు ఈ ప్రాంతాలన్నిటినీ తరచు చూస్తూ ఉండవలసిన అవసరమున్నది. రిపోర్టులు తెప్పించుకొనుటకు సూచనలు ఇచ్చుటకు కేంద్ర ఆఫీసును ఒక దానిని తెరిచి అది రెగ్యులరుగా పని చేసేటట్లు చూడవలసి వుంది. కేంద్ర ఆఫీసు, చురుకైన కార్యకర్తలు లేకుండా మహిళా సంఘనిర్మాణం చురుకుగా అందెలు వేస్తూ సాగాలంటే జరగని పని. మహిళా ఉద్యమం అభివృద్ధి చెందాలని అభిలషించిన ఎడల సమర్థులయిన కార్యకర్తలు ఎందుకు లభ్యం కావడం లేదో చూడవలసియున్నది.

1940-'47 ప్రాంతం వరకూ రాష్ట్ర మహిళా సంఘం చురుకుగా పనిచేసింది. ఆనేక మంది స్త్రీలు మహిళా సంఘ నిర్మాణమే ధ్యేయంగా పెట్టుకొని, కష్ట నిష్టురాల కోర్చి, సర్వం ఒడ్డి ఈ రంగంలో పనిచేశారు. ఆ తరువాత గడిచిన ఈ పుష్కరంలోనూ, సంఘ నిర్మాణం ఎదుగూ బొదుగూ లేకుండా వుండిపోయింది. ఈ రంగాన్ని పునరుద్ధరించడానికి ఒక సారిఒక రాష్ట్ర మహాసభ, మరొకసారి అఖిలభారత సభ ఏర్పాటు చేసినా గూడ ఫలితమేమీ కన్పడలేదు. పైనుంచి ఎంత ఉత్సాహం కలిగించాలని ప్రయత్నించినా లాభం లేకపోయింది. దీనికి లోపమెక్కడున్నదో ఆలోచించవలసివుంది.

"ప్రతివంటింటి స్త్రీ పరిపాలనాదక్షత సంపాదించాలని, ఆ రోజే ఏ దేశ సౌభాగ్య మయినా అభివృద్ధి చెందుతుం"దని లెనిన్ నహాశయుదు కొన్ని దశాబ్దాల క్రిందట ఉద్ఘాటించాడు. ఈ నాటికీ అది వేదవాక్కు వలె స్మరిస్తూవుంటాము. కమ్యూనిస్టు సమాజంలో తప్ప మరియే యితర సమాజంలోనూ స్త్రీల స్థానం హోదా బాగుపడదని ఢంకా మీద దెబ్బకొట్టి వాదించడం జరుగుతున్నది. చైనాలోను, రష్యాలోను. ఏవిధంగా స్త్రీలు సర్వహక్కులు అనుభవిస్తున్నారో, వారికేవిధంగా అన్ని అవకాశాలు లభ్యమయినాయో ఉదాహరణ లిస్తూ వుంటాము. సాంఘిక విద్యా రంగాలలో స్త్రీలు సాధించిన సమానతను చూచి విస్తుపోతూ వుంటాము. అయితే మన దేశంలో కమ్యూనిస్టుల మని చెప్పుకునే మనం ఏ దృక్పథంతో మహిళలను మహిళా సంఘాలను చూస్తున్నామో పరిశీలిస్తే ఫ్యూడల్ యుగపు సాంప్రదాయాలు, వాటి వాసనలు మనల్ని వదలటం లేదేమో ననిపిస్తుంది.

కమ్యూనిస్టులు సమాజానికంతటికి ఆదర్శ ప్రాయమయిన వ్యక్తులని, స్త్రీల సమాన హక్కులను ఆదరించే వ్యక్తులని, సంసార నిర్వహణలో స్త్రీని బానిసగా చూడని వ్యక్తులనీ, మహిళాసంఘాల నిర్మాణావసరాన్ని గుర్తించి, స్త్రీలకు చైతన్యం కలిగించగల రాజకీయ పరిజ్ఞానం కల వ్యక్తులని, చదువు సమర్థత కలిగి మహిళాసంఘ నిర్మాణమందు ఆసక్తి చూపుతున్న మహిళలను అభివృద్ధిపరచి ముందడుగు వేయిస్తారని, ఇలా ఎన్నో ఆశించడం సహజం. కమ్యూనిస్టు ప్రభుత్వమున్న దేశాలలో స్త్రీల పరిస్థితి తెలుసుకున్న తరువాత ఇది తప్పని సరి. కాని మనం చూస్తున్నది ఈ పరిస్థితులకు పూర్తిగా విరుద్ధం.

మహిళాసంఘ నిర్మాణంలో ఒకనాడు చేయూతనిచ్చి ముందుకు ఉద్యమాన్ని ఉరకలు వేయించిన కమ్యూనిస్టు పార్టీ ఈరోజు

ఆ బాధ్యత విషయమై ఎక్కువ శ్రద్ధ చూపడం లేదు. ఆరోజు మహిళా కార్యకర్తలచేత ప్రచారం చేయించిన నినాదాలు ఈరోజు ఆచరణలో ఉల్లంఘించ బడుతున్నాయి. మహిళా ఉద్యమ నిర్మాణంలో మొదటి నినాదం సాంఘికంగా సమానహక్కులు. ఈ నినాదం మీదనే మన దేశంలో సంఘ సంస్కర్తలు మహిళా ఉద్యమాన్ని ప్రారంభించారు. ఆ నినాదాల ఆధారంమీదనే ఆంధ్రరాష్ట్ర మహిళా సంఘ నిర్మాణం జరిగింది. ముఖ్యంగా వివాహంలో సమాన హక్కులు, వారసత్వం, వరకట్న నిషేధం మొదలగు సమస్యలన్నిటీమీద సంతకాలు సేకరించడం, ఆందోళన చేయడం, స్త్రీలను సంఘటితపర్చడం జరిగింది. ఈ కార్యక్రమాలకు స్త్రీల సానుభూతి సహకారాలు హెచ్చుగా లభ్యమయినాయి. ఈ కార్యక్రమ నిర్వహణలో సమర్ధులయిన మహిళా కార్యకర్తలు తయారయినారు. ఉద్యమం ఉరకలు వేస్తూ సాగింది.

**ఉద్యమ నినాదాల యెడ నిర్లక్ష్యం**

తర్వాత ఉద్యమం హఠాత్తుగా గండి పడింది. కారణం వేరే వెతకనక్కర లేదు. మహిళా రంగంలో చొరవగా పని చేయడానికి ముందుకు వచ్చిన స్త్రీలను కమ్యూనిస్టు పార్టీ ఆదుకోలేక పోయింది. మహిళాసంఘ నిర్మాణంలో పనిచేసిన ప్రముఖ కార్యకర్తలందరూ కమ్యూనిస్టు పార్టీ సభ్యులనే విషయం మర్చిపోకూడదు. సమాజమంతా ఎంతో విలువతో చూసుకునే గృహము, బిడ్డలు మొదలగువాటిని ప్రక్కకునెట్టి, పిల్లల యోగక్షేమాలు చదువు మొదలగు వాటిని గురించయినా ఆలోచించకుండా ఎంతో ఉత్సాహంలో పనిచేయడానికి వచ్చిన కార్యకర్తలను ఈ నాడు, ఏమి ఎదుర్కొంటున్నది? ఏవిలువల కొరకయితే వారు సర్వంఒడ్డి పనిచేశారో ఆవిలువలను ఈ రోజు కమ్యూనిస్టు పార్టీ తేలికగా చూస్తున్నది. బహు భార్యా నిషేధ చట్టం ప్రచారం చేశాం. ద్వితీయ వివాహం చేసుకున్నపుడు ప్రథమభార్యకు రక్షణ ఉండా లన్నాము. ఈ హక్కులను కమ్యూనిస్టు పార్టీ బలపరచిందని విస్మరించకూడదు. కాని యీరోజు బాధ్యతాయుత స్థానాలలో ఉన్న వ్యక్తులు ద్వితీయ వివాహం చేసుకుంటే ఏమీచేయలేకపోతున్నాము. ఎప్పుడో కమ్యూనిస్టు సమాజం వచ్చిననాడు ఒరగ పెడతామంటే మనను నమ్మేదెవరు? ఆయన చాలా సమర్ధుడయిన అర్గనైజరు కనుక ఈ చిన్న తప్పును సహించడం నేర్చుకోమన్నది కమ్యూనిస్టు పార్టీ. విడాకుల హక్కు కావాలని ప్రచారం చేశాము. కాని దానికున్న పరిమితులను విస్మరించి, ఉన్న పెండ్లాలను వొదిలి, క్రొత్తవారిని తెస్తున్నవారు కమ్యూనిస్టు పార్టీ సభ్యులలో లేకపోలేదు. ఇటువంటి సందర్భాలలో న్యాయ రీత్యా కోర్టులో విడాకులిచ్చుకోడానికి ధైర్యంలేక, బహుభార్యాత్వ నిషేధ చట్టం ప్రకారం ద్వితీయ వివాహం జరుపుకోలేక మొదటి ఆమెను ఒదిలివేశాడో రెండో ఆమెను ఉంచుకున్నాడో తెలియని త్రిశంకు స్వర్గంలో వేళ్లాడడం జరుగు తున్నది. ఈ ముగ్గురూ పార్టీకి సన్నిహితు లయినపుడు సమస్య వెర్రితలలు వేస్తున్నది. ఇటువంటి సందర్భములలో అన్యాయం జరిగిన స్త్రీని ఆదరించి రక్షణ ఇవ్వడం చేతగాక, కమ్యూనిస్టు పార్టీ సభ్యులే ఏదో సర్దుకోమంటే 'ఎన్నాళ్ళకావిముక్తి?' అనిపించక మానదు. అణగారిపోయి అధోగతిలో ఉన్న స్త్రీలను ఉద్ధరించడానికి ఉపయోగపడాలిసిన విడాకుల హక్కు, పురుషుడు విచ్చలవిడిగా తిరిగేందుకు ఉపయోగపడుతుంటే కమ్యూనిస్టు పార్టీ ఉపేక్షించడం కూడదు.

స్త్రీలకు విద్యావకాశాలు హెచ్చుగా కలిగించాలి అని, స్త్రీలను చదివించాలి అని మహిళాఉద్యమంలో కార్యకర్త లిచ్చిన నినాదం. కమ్యూనిస్టు పార్టీతో సంబంధంలేని స్త్రీలను చదువుకోండి అని ప్రోత్సహిస్తూ, పార్టీలో బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారే తమ ఆడపిల్లలను చదివించక , యింట్లో కూర్చోపెడితే ఏమనాలి? భార్యలను కొట్టకూడదు. నీచంగా చూడకూడదు, జమిందారి యుగపు సాంప్రదాయాలు విడనాడి, రాజకీయంగా ఆమెను అభివృద్ధి చేయాలని ఆశయం. భర్త సంసార బాధ్యత పట్టించుకోకుండా రాజకీయాలలో పాల్గొంటుంటే ఆయనను అర్ధంచేసుకోగల రాజకీయ పరిజ్ఞానం, సంసారాన్ని స్వతంత్రంగా నడిపించుకోగలిగిన నేర్పు స్త్రీలకు కలిగించాలని ఒకనాడు ఆశయంగా ఉండేది. ఆ ఆశయం నిర్వహణలో కమ్యూనిస్టుపార్టీ సభ్యులు తమతో పరిచయము, సంబంధము ఉన్న స్త్రీలందరికీ రాజకీయ పరిజ్ఞానం కలుగచేసి మహిళారంగంలో కార్యకర్తలుగా తయారు చేశారు. ఆ కార్యక్రమాలు ఈ రోజు ఏమయినాయి? ఆ సమానతా భావంతో, గౌరవభావంతో, ఇంటియందలి మహిళలను కమ్యూనిస్టుపార్టీ సభ్యులు చూస్తున్నారా! ఏడాదికోసారి, జన్మానికో శివరాత్రిలాగా ఒక మహిళాసంఘ సమావేశానికి వెళ్ళి, ఆ రోజు భోజనంలోకి కూరలేకపోతే కూరలేకుండా భోజనం చేసినందుకు ఎంతో త్యాగం చేసినట్లు ఫోజులుపెట్టితే, ఏమని అభినందించగలం? సంసారంలో రోజూ నిర్వర్తించవలసిన అసంఖ్యాక మయిన పనుల్లో ఒక్క దాంట్లోనూ స్త్రీకి సహాయం లభించదు. కంచాలు పెట్టడం, అన్నం వడ్డించుకోడం, ప్రక్కలు పరవడం మొదలగు చిన్న చిన్న పనులన్నీ కూడ ఆడది చేవలసినవే గాని, మేము చేస్తామా అని తరతరాలనుండి వస్తున్న అహంభావంమాత్రం ఎన్ని కబుర్లుచెప్పి ఉపన్యాసాలిచ్చినా ఆచరణలో తగ్గటం లేదు. ఈ చిన్న చిన్న సమస్యలు, భార్య మహిళా రంగంలో ప్రముఖ పాత్ర వహించనంత కాలం కనిపించవు. ఇరవయి నాల్గు గంటలూ ఇంటిదగ్గరే ఉంటుంది కనుక పనిచేసుకొనడంలో కష్టం కలుగదు. కాని భార్య, మహిళలను సంఘటితపరచాలి అనే రాజకీయ చైతన్యం సంపాదించిననాడు ఆమె కూడ రోజుకు కొన్ని గంటల చొప్పున ఇంటి వెలుపలి కార్యక్రమాలు నిర్వర్తించవలసి ఉంటుంది. ఈ కార్యక్రమ నిర్వహణలో కీచులాటలు ప్రారంభమవుతున్నాయి. ఇంటికి వచ్చేప్పటికి స్నానానికి వేడినీళ్లు రెడీగా ఉండవు! రాత్రి భోజనానికి కూర్చుంటే, అన్నం చల్లారి పోయివుంటుంది! పాపం ఆమె తిరిగి వచ్చే ప్పటికీ ఆలస్యమవుతుందిగదా అని మధ్యాహ్నమే వంటచేసి వెళ్ళివుంటుంది. టైముకి కాఫీ అందించేందుకు ఇంట్లో భార్య ఉండదు. వెంటనే 'నీకు షికార్లు

ఎక్కువవుతున్నాయేం?' అన్న ప్రశ్న వస్తుంది. దీనికి పరిష్కారం చాలా తేలికగా కనిపెట్టబడింది. భార్యను రాజకీయంగా అభివృద్ధి చేయకపోతే సరి! ఆమె మాఆయన ఎం.ఎల్.ఎ. అయినాడా, ఎం.పి. అయినాడా అని ఎదురు చూస్తూ ఉంటుంది. పూర్వం కలెక్టరుగారి భార్యకు, తహశీలుదారు భార్యకు హోదా హెచ్చు, అలా ఈనాడు కమ్యూనిస్టు పార్టీలో అంతస్థుల హోదాను పట్టి భార్యల స్థాయికూడ పెరిగే దశ వచ్చింది. స్వతంత్రంగా స్వీయాభివృద్ధి ద్వారా తన స్థాయిని పెంచుకోగల అవకాశం స్త్రీకి కమ్యూనిస్టు పార్టీలో సహితం నిరాకరించ బడుతున్నది. వివాహానికి పూర్వం చురుకుగా పనిచేసిన స్త్రీలను, రాజకీయంగా బాగా అభివృద్ధి చెందిన మహిళలను, కమ్యూనిస్టుపార్టీ సభ్యులు వివాహం చేసికొని గృహానికి కట్టిపెట్టెయ్యడం క్షమించరాని విషయం. పార్టీ సభ్యులుగా ఉన్నవారు పార్టీ సభ్యత్వమునకు దరఖాస్తుకూడ పెట్టనటువంటి స్థితికి దిగజారారంటే ఎవరిది లోపం?" పురుషుడు రాజకీయ కార్యకలాపాలలో పాల్గొంటున్నపుడు, ఆ ఇంట్లోనే కార్యకర్తగా అనుభవం సంపాదించిన స్త్రీ వున్నప్పుడు, ఇద్దరూ గృహ నిర్వహణ భారం వహించకపోతే ఎలాగు అనే ప్రశ్నతో విధిగా స్త్రీని యింటిదగ్గర వుంచేయడం జరుగుతున్నది. అభ్యుదయ కాములయిన కమ్యూనిస్టుపార్టీ సభ్యులు తమ భార్యలను ముందడుగు వేయనీయకపోతే, మహిళారంగ నిర్మాణాని కవసరమయిన కార్యకర్తలు ఎక్కడ నుండి ఉద్భవిస్తారు? అత్యంత పురోగామిశక్తి అయిన కమ్యూనిస్టుపార్టీ పరిధి లోనికి వచ్చిన స్త్రీలు గాక ఇతర రంగాలనుంచి స్త్రీలు మహిళా ఉద్యమనిర్మాణానికి ముందుకు వస్తారని ఆశిస్తే చాలా హాస్యాస్పదంగా ఉంటుంది. ప్రస్తుతం కమ్యూనిస్టుపార్టీతో సంబంధమున్న స్త్రీ లందరినీ నిష్క్రియా పరులనుగా తయారు చేయడంజరిగింది. పూర్వం నుండి మహిళారంగంలో ఉన్న కార్యకర్తలు పైన చెప్పిన పరిణామాలతో నిరుత్సాహపడి రంగం నుంచి తప్పుకోడం, సంసారాలను చక్కదిద్దుకోడం జరుగుతున్నది.

కనుక, మహిళా సంఘాలు పునరుద్ధరించ బడాలి అనే నినాదం వూరికే ఇచ్చినంత మాత్రాన మహిళాసంఘం పునరుద్ధరించబడదు. మొన్న కాశీలో జరిగిన భారత జాతీయ మహిళా మహాసభకు విజయనగరం మినహా ఆంధ్రరాష్ట్రం మొత్తంమీద (సర్కారు జిల్లాలు) ఒక్క ప్రతినిధి కూడ హాజరుకాలేని పరిస్థితి సంభవించింది. నిద్రాణమయిఉన్న ఈ శక్తులను కదిలించాలంటే కొన్ని నిర్దిష్టమయిన చర్యలు కమ్యూనిస్టుపార్టీ తీసికొనక తప్పదు. అవి ఆచరణలోకి రానంత కాలం కమ్యూనిస్టుపార్టీ మీద కొంత సానుభూతి సంపాదించవచ్చునే గాని, స్త్రీలకుపయోగపడే కార్యక్రమాలను కమ్యూనిస్టుపార్టీ చేబడుతుందని నమ్మించడం కష్టం.

**కార్యక్రమం:**

1. సాంఘిక దురాచారాల యెడల కమ్యూనిస్టుపార్టీ దృక్పథం ఖచ్చితంగా నిర్ణయించి, ఆ దృక్పథానికి విరుద్ధ భావాలను ప్రదర్శించిన వారిని పార్టీ నిర్మాణంలో ఏ బాధ్యతాయుత స్థానంలో ఉన్నా సరే క్రమశిక్షణ చర్యలను అమలు జరపాలి. కమ్యూనిస్టుపార్టీ బాధ్యులుగా ఉండి, నైతిక జీవనంలో విచ్చలవిడితనాన్ని ప్రదర్శించిన స్త్రీ పురుషులను సహించరాదు. సమాజానికి పురోగామిక శక్తులమని, ఈ రంగంలో కూడ ఒకడుగు ముందుంటామని నిరూపించుకోవాలి. ఇటువంటి పరిస్థితులలో అన్యాయం చేయబడిన స్త్రీని ఆదరించి, మహిళాసంఘ కార్యకర్తగా తయారు చేసి అభివృద్ధి చేయవలసిన బాధ్యతను పార్టీ చేపట్టాలి.

2. కమ్యూనిస్టు పార్టీ రాజకీయ పరిధి లోనికి వచ్చి సమర్థురాలయిన కార్యకర్తగా అభివృద్ధి చెందగల అవకాశా లున్నప్పుడు, యిల్లు ఎవరు చూస్తారు అనే నెపంతో ఇంటిదగ్గర వుంచేయడం కాక, ఆమెను అభివృద్ధి పరచడానికి పార్టీ సర్వశక్తులా కృషి చేయాలి. మహిళా కార్యకర్తలు అపురూపంగావున్న ఈ దశలో వీరికి భృతి ఇవ్వలేమని, ఆమెకు ఇంగ్లీషు రాదని వంకలతో అభివృద్ధిపరచ నిరాకరించకూడదు. లభించిన ఒకరిద్దరు మహిళలను ఇముడ్చు కోడానికి ప్రయత్నించాలి.

మహిళా సంఘాల నిర్మాణంతోబాటు, గృహ బాధ్యత ఎవరు నిర్వహిస్తారు అనే సమస్య ఎదుర్కోక తప్పదు. కాని ప్రతిసారీ పురుషుడే పార్టీకి తప్పనిసరిగా అవసరంకనుక భార్యను ఇంటిదగ్గర ఉంచేయడం సాధారణంగా జరుగు తున్నది. ఇది ఖచ్చితంగా అభివృద్ధి చెందవలసిన స్త్రీ సభ్యులపట్ల చేస్తున్న ఒక అన్యాయం. భార్యా భర్తలిరువురూ కార్యకర్తలుగా వున్నప్పుడు వారి సంసార బాధ్యతను ఆర్థికంగా పార్టీ భరించాలిసి వుంటుంది. ఆర్థిక స్థోమత లేదనడం సమస్యను పరిష్కరించడం కాదుకదా సమస్యనుంచి తప్పించుకొని పారిపోవడం అవుతుంది. తదితర రంగాలలో, కార్యకర్తల అభివృద్ధికి ఏవిధంగా పాటుపడుతున్నారో అలాగే ఈరంగంలో కూడ గృహబాధ్యతల నెపంతో తోసివేయక, అభివృద్ధి చెందగల కార్యకర్తలను అభివృద్ధి చేసికోవలసిన బాధ్యతను చేపట్టాలి.

3. సంఘంలో పరిస్థితుల ప్రభావం వల్ల, జీవితంలో ఎదురు దెబ్బలుతిని అందరినీ ఎదిరించి, కమ్యూనిస్టుపార్టీ రాజకీయాల వైపు ఆకర్షించబడిన స్త్రీలు అక్కడక్కడా కన్పిస్తారు. కమ్యూనిస్టుపార్టీ తప్ప మరి యే ఇతర రాజకీయ పార్టీ తమ చర్యలను ఆమోదించదని తెలిసి మనమేదో దారి చూపిస్తామని ఆశతో వుంటారు. ఆవిధంగా మన పరిధిలోనికి వచ్చిన స్త్రీలను ఏ విధంగా ఉపయోగించుకోగలమో ఆలోచించ వలసి వుంటుంది. 'మేము ఏమీ చేయలేము. ప్రస్తుత సమాజ నిర్మాణంలో, నీ భర్త నిన్ను ఎన్ని అగచాట్లు పెట్టినా తలవంచి ఉండవలసిందేను, ఎదిరిస్తే సంఘం నిన్ను ఆమోదించదు. కనుక నీ పాత నీ జీవితంలోకి నీవు వెళ్ళు" అని త్రిప్పి పంపుతామా! లేక ఆమెలో ఉన్న విప్లవకర స్వభావాన్ని ఉపయోగించుకొని, రక్షణఇచ్చి, మహిళాసంఘ కార్యక్రమాలు నిర్వర్తించే కార్యకర్తగా తయారు చేసి కొంటామా? ఇది ఆలోచించాలి, సంఘ దురాచారాలను ఎదిరించే స్త్రీలకు మనం రక్షణ

కలిగించకపోతే, ఈ రంగంలో మనం ముందడుగు వేయడం సంభవించదు. వారందరి శక్తుల్నీ మనం ఉపయోగించుకోడానికి ప్రాతిపదిక ఆలోచించాలిసి ఉంటుంది.

4. ప్రస్తుతం అక్కడక్కడ అన్ని పట్టణాల లోను గ్రామాల్లోను ధైర్యవంతులయిన మహిళలు కన్పిస్తున్నారు. ఒక మహిళాసభ జరుగుతే ఆ సభకు వస్తున్న స్త్రీలసంఖ్యే దీనికి నిదర్శనం. ఈ స్త్రీలందరినీ ఒక కార్యక్రమంవైపుకు త్రిప్పి నడిపించడానికి స్త్రీల సమస్యలను చర్చించే ఒక పత్రిక అవసరం. ఈ పత్రికను నడిపించవలసిన ఆర్ధిక బాధ్యతను గురించి తీవ్రంగా ఆలోచించ వలసి ఉంటుంది. పత్రికా నిర్వహణకు అవసర మయిన విద్యాధికులయిన స్త్రీలను జీతాలిచ్చి నియమించాల్సిన అవసరం కూడా ఏర్పడ వచ్చును.

5. రాష్ట్ర మహిళాసంఘ ఆఫీసు ఏర్పాటు జరగాలి. ఇది ఒకటి ఏర్పడితే గాని రాష్ట్రం మొత్తంమీద వివిధ స్థానిక మహిళాసంస్థల కార్యక్రమాలు, రిపోర్టులు ఒక చోటకు చేరవు. అవసరమయిన సంస్థలకు సూచనలిచ్చే కార్యక్రమంతకూడ ఈ ఆఫీసుద్వారానే జరుగు తుంది. ఆఫీసు వ్యవహారాలను నిర్వహించేందుకు ఒకరిద్దరు స్త్రీలను జీతాలమీద నియమించ వచ్చును. ఈరోజుఎంతోమంది పట్టభద్రులయిన స్త్రీలు ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. వుద్యోగస్తులుగా వారిని ఆహ్వానించి కార్యకర్తలుగా తయారు చేసుకోవడం చాలా సులభం.

6. రాష్ట్ర వ్యాపితంగా మహిళా సంఘాల నిర్మాణానికి ఆర్గనైజర్లు ప్రస్తుతదశలో దొరకడం కష్టం. జిల్లాలలో కూడ యిది శ్రమతో కూడుకున్నపని. అయినా కూడ నెలకు యింత జీతమిస్తామంటే ప్రస్తుతం గ్రామ సేవికలు మొదలగు ఉద్యోగాలకు అర్రులు చాస్తున్న చాలమంది అనాథస్త్రీలు లభ్యమవుతారు. ఈమాదిరి వ్యక్తులు సమర్థులయినవారు దొరికినప్పుడు, మహిళాసంఘ ఆర్గనైజర్లుగా నియమించగలమేమో ప్రయత్నించాలి.

ఈ పై కార్యక్రమాలన్నిటికీ డబ్బు ఎక్కడనుండి వస్తుందనే సమస్య వుత్పన్న మవుతుంది. నా సమాధానమేమంటే కమ్యూనిస్టు పార్టీ నిర్వహణ ధనలోపం వలన మూలపడ లేదు. అదేవిధంగా ఈ రంగాన్ని అభివృద్ధి చేయాలన్న భావన వుంటే ఏ ప్రాంతంలో వున్న కమ్యూనిస్టుపార్టీ శాఖలు ఆ ప్రాంతంలో వున్న మహిళా శాఖలకు ఆర్థికంగా సహాయ పడవచ్చును.

గత కొన్ని సంవత్సరాలనుండి మహిళలలో పని చేస్తున్నందున, కార్యక్రమ నిర్వహణలో మేము ఎదుర్కొన్న కొన్ని సమస్యలను, చదువరుల ముందుంచుతున్నాను. మహిళా సంఘాలు ముందంజ వేయకపోడానికి కారణాలను, మా దృక్పథాన్ని వివరించాను. చదువరులు, కమ్యూనిస్టుపార్టీ సభ్యులు దీనిని సహృదయంతో గ్రహిస్తారని ఈ సమస్యల గురించి తీవ్రంగా ఆలోచిస్తారని ఆశిస్తాను.

oooo